epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక



## పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- మూడు విడుతల్లో సర్పంచ్ ఎన్నికలు
- డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్

4లో

సంపుటి : 02 | సంచిక : 177 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 26 నవంబర్ 2025 | పేజీలు : 04



## పేదల సేవే లక్ష్యంగా పనిచేయాలి

- జల సంరక్షణలో జాతీయ అవార్డు అభినదనీయం
- ప్రభుత్వ అస్పత్రుల్లో నార్మల్ డిలివరీలను పెంచాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి
- దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ కావ్య

2లో



## ధాన్యం కొనుగోలు స్పీడప్ చేయాలి

- కాంటా వేసిన వడ్లను వెంటనే తరలించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

2లో







# పేదల సేవ లక్ష్యంగా పనిచేయాలి

- జల సంరక్షణలో జాతీయ అవార్డు అభినందనీయం
- ప్రభుత్వ అస్పత్రుల్లో నార్మల్ డిలివరీలను పెంచాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి
- దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ కావ్య





**జనగామ, మన చౌరాస్తా :** పేద ప్రజలకు సేవ చేయడమేనని మన ప్రధాన కర్తవ్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశ కమిటీ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఎంపీ కావ్య అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్లో జరిగిన 'దిశా' (జిల్లా అభివృద్ధి సహకార మరియు మానిటరింగ్ కమిటీ) సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ పాల్గొన్నారు. ముందుగా జల సంరక్షణ కోసం వివిధ చర్యలని చేపట్టి కేంద్రం నుంచి జిల్లాకి జల పురస్కారం వచ్చేలా కృషి చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ని ఎంపీ, శాసనసభ్యులు అభినందించారు. అనంతరం జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ, విద్య, వైద్యం, ఆరోగ్యం, జాతీయ రహదారుల విభాగం, రోడ్ల భవనాలు, తదితర శాఖల ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. కేంద్రం పరిధిలోని పలు శాఖల పనితీరుపై చర్చించారు. కొత్తగా చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. ముఖ్యంగా వైద్య శాఖ అధికారుల పని తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో సాధారణ డిలీవరీలు ఎందుకు జరగడం లేదని సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. గ్రామాలలో మహిళా గర్భధారణ జరిగినప్పటి నుంచి ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ డిలివరీ సమయానికి ఆపరేషన్ ఎందుకు చేయాల్సి వస్తుందని అన్నారు. సాధారణ డిలివరీలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం కృషి తో నేడు అన్ని అంశాల్లో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో దూసుకు పోతోందన్నారు. నిరుపేద లకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాల ఫలాలు ప్రతీ గడపకి అందేలా అన్ని శాఖల అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన ఉపాధి హామీ పని దినాలు పెంచే విధంగా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా మండలానికి ఒక సోలార్ ప్లాంట్ జిల్లాలోని 12మండలాలలో ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ .. జిల్లాలో విద్యాశాఖను బలోపేతం చేసేందుకు చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. దిక్సూచి కార్యక్రమాన్ని చేపట్టి.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. కేవలం విద్యలోనే కాక క్రీడల్లో, సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్ లో వారి కేరిర్ కి అవసరమయ్యే ప్రధాన అంశాల్లో ప్రతి రోజు దిక్సూచి ద్వారా వారికి శిక్షణను అందిస్తున్నామన్నారు. సమావేశంలో డీఆర్డీవో వసంత, దిశా కమిటీ సభ్యులు మాధవి, వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్





**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** చిల్పూర్ మండలం రాజవరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. నిర్వాహకులు రిజిస్టర్ లను సరిగ్గా మెయింటైన్ చేస్తున్నారా లేదా అని కలెక్టర్ చెక్ చేసారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలనీ, వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటి వరకు 1644 మంది రైతులకు 3.21 కోట్ల రూపాయల బోనస్ డబ్బులు జమా అయ్యయని తెలిపారు.

# ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు

**చేర్యాల, మన చౌరాస్తా :** గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చేర్యాల లోని టీఎస్డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాల సిబ్బందిలో తప్పనిసరిగా పాటించాల్సిన ముఖ్యమైన ట్రాఫిక్ నిబంధనలపై గజ్వేల్ ట్రాఫిక్ ఎస్ఐ నీరేష్ అవగాహన కల్పించారు. వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేనివారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని వివరించారు. మైనర్ డ్రైవింగ్ 18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, చట్టరీత్యా నిషేధమని, దీని వల్ల కలిగే పరిణామాలు మరియు ప్రమాదాల గురించి తల్లిదండ్రులను, విద్యార్థులను హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ఘోరమైన ప్రమాదాలు, జరిమానాలు, శిక్షల గురించి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ హనుమంత్, కిరణ్ పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని

# ప్రజలకు వివరించాలి

## గ్రామాల్లో బీఆర్ఎస్ క్లస్టర్ మీటింగ్‌లు



**జనగామ, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను గడపగడపకు వెళ్లి వివరించాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్చార్జిలు పిలుపునిచ్చారు. మంగళవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు క్లస్టర్ ఇంచార్జిలు జనగామ పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి ప్రేమలత రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్ మారబోయిన పాండు, బీఆర్ఎస్ పట్టణం యూత్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల సందీప్, బీఆర్ఎస్ జనగామ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి, రైతు సమితి మండల అధ్యక్షుడు బురెడ్డి ప్రమోద్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్ జనగామ మండలంలోని చీటకోడూరు, చౌడారం, మరిగడి గ్రామాల్లో కార్యకర్తలతో సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.



# మహిళా సంఘాలకు రూ.304 కోట్ల వడ్డీ లేని రుణాలు

- చెక్కులు అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్/హుస్నాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మంగళవారం మరో ముఖ్య కార్యక్రమాన్ని ముందుకు తీసుకువచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి కార్యక్రమం కింద మొత్తం 304 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ కార్యక్రమం భాగంగా మినిస్టర్ క్వార్టర్స్లో హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన ఏడు మండలాల్లోని 5,329 మహిళా సంఘాలకు మొత్తం రూ.5. 66 కోట్ల విలువైన చెక్కులను మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా పంపిణీ చేశారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురు మామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన మహిళా సంఘాలకు రుణాలు అందించబడాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, మహిళల ఆర్థిక పురోగతికి అవసరమైన రుణాలను ఎంతైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళలు తీసుకునే రుణాలపై వడ్డీని ప్రభుత్వం భరించడం ద్వారా కుటుంబాల ఆర్థిక భారం తగ్గుతోందని అన్నారు. పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, సేవా రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం రాష్ట్ర అభివృద్ధి దిశగా మంచి సంకేతమని పేర్కొన్నారు. ఇప్పటికే బ్యాంకులు మహిళా సంఘాలకు రుణాల మంజూరులో ముందుకు వస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాల్లో చేరి అభివృద్ధి దిశగా అడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. వడ్డీ లేని రుణాలు అందడంతో మహిళా సంఘాలు ఆనందం వ్యక్తం చేశాయి. తమ వ్యాపారాలు, జీవనోపాధి, కుటుంబాభివృద్ధికి ఈ రుణాలు ఎంతో తోడ్పడనున్నాయని మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సమూహాలు భారీగా పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

## వరంగల్ ఎంపీ కడియం కావ్య

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఘనపూర్ లోని కన్వే న్షన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, ఇందులో భాగంగా మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను అందిస్తుందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని (7) మండలాలలో డిసెంబర్ 2023 నుండి జూలై 2025 వరకు నాలుగు విడతలలో 5621 సంఘాలకు 20.45 కోట్లు వడ్డీలేని రుణాలు విడుదల అయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు నిర్దేశిత కాలం లో ఇప్పటివరకు జిల్లాలో డిసెంబర్ 2023 నుండి జూలై 2025 వరకు నాలుగు విడతలుగా జిల్లాలో మొత్తం 9216 సంఘాలకు 30.53 కోట్లు మంజూరయాన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, డిఆర్డీఓ వసంత, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.





# వడ్డీ లేని రుణాల పంపిణీ చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా

**చేర్యాల, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా ముస్త్యాల గ్రామంలో రైతు వేదిక లో చేర్యాల, మద్దూరు కొమరవెల్లి,దూల్మిట్ట మండలాలకు చెందిన మహిళల స్వయం సహాయక సంఘాలకు 1.55 కోట్ల వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఎమ్మెల్యే పల్లా సంఘాలను ఉద్దేశించి మాట్లాడుతూ వడ్డీ లేని రుణ పథకాలు గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించగా దానిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం పట్ల అభినందనీయమని పేర్కొన్నారు . మహిళల అభివృద్ధికి దోహదపడ పథకాలపై ఏ ప్రభుత్వమైనా ముందుకు తీసుకెళ్లడం ఎంతో ప్రశంసనీయమని అన్నారు.20 లక్షల రుణం తీసుకున్న మహిళలకు కేవలం ఐదు లక్షలకే వడ్డీ లేని రుణాలను వర్తించడం కాకుండా, ఆ పరిమితిని మహిళల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మరింతగా పెంచాలని మహిళల తరపున ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.




# పిల్లల ఎదుగుదలలో కౌమార దశ కీలకం

## ముగిసిన లయన్స్ క్వెస్ట్ శిక్షణా శిబిరం

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థి ఎదుగుదలకు కౌమార దశ కీలకమని లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ కౌన్సిల్ కార్యదర్శి లయన్ కుందూరు వెంకటరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ జనగాం ఆబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సోమవారం ఉదయం పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు ప్రారంభించిన ఈ శిబిరంలో జనగామ పట్టణానికి చెందిన 9 పాఠశాలల నుండి 22 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నల్లగొండ నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్ లయన్ కొండపల్లి రేణుక రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఏకశిల బిఇడి కళాశాల ప్రాంగణంలో లయన్స్ క్వెస్ట్ జిల్లా చైర్మన్ లయన్ కనుగంటి సుభాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శిక్షణ పొందిన పలువురు టీచర్లు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు లో మంచి పౌరులుగా రాణించుటకు తీర్చి దిద్దే ప్రక్రియ లయన్స్ క్వెస్ట్ ద్వారా నేర్చుకున్నామని అన్నారు. కౌమార దశలో విద్యార్థిని సత్సాంగత్యం వైపు ఆకర్షింపజేయగలిగితే లక్ష్యం నెరవేరినట్లేనని పలువురు ఉపాధ్యాయులు తమ స్పందన ద్వారా తెలిపారు. విద్యార్థులను ఆకట్టుకునే క్రమంలో తాము అనేక కొత్త విషయాలు తెలుసుకున్నా మని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ రకంగా మాట్లాడిన వారిలో శిక్షణ పొందిన టీచర్లలో ప్రమోద్, రజిత, ప్రభాకర్, జోసెఫ్, శ్రీకాంత్, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి, మహమ్మద్ సోలేహం, ఎం. కవిత, లుంబనాయక్ తదితరులు ఉన్నారు. విద్యార్థులకు కావలసిన పాఠ్య పుస్తకాలు త్వరలో పంపిణీ చేస్తామని క్లాసులు నిర్వహించుటకు ఉపాధ్యాయులు సిద్ధపడాలని సమావేశంలో పాల్గొన్న ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ పుట్ట హరికిషన్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ కె. రాజశేఖర్ రెడ్డి, జిల్లా జి ఎస్. టి కోఆర్డినేటర్ రేపూరి రమణారెడ్డి, క్లబ్ కార్యదర్శి పి. సురేశ్ కుమార్, కోశాధికారి లయన్ సుదగాని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీలేని రూణాలు అందజేసిన ఎమ్మెల్యే

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మహిళలను కోటేశ్వర్లను చేయాలని లక్ష్యం ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశశ్విని రెడ్డి అన్నారు. జనగాం జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని మహిళ సమైక్య భవనం ప్రాంగణంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రుణాల చెక్కులను మహిళలకు అందజేశారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని 2410 స్వయం సహాయక సంఘాలకు మొత్తం రూ. 6 కోట్లు 73 లక్షల విలువైన రుణాలను ఎమ్మెల్యే గారు పంపిణీ చేశారు. భారీ ఎత్తున నిధులు మంజూరవడంతో మహిళలు చిన్న వ్యాపారాలు, ఆదాయోపాధి కార్యక్రమాలు మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం లభించనుంది. అనంతరం, మహిళల శక్తీకరణకు సంకేతంగా ఇందిరా మహిళ శక్తి చీరలను కూడా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. చీరలు అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా *ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు హృదయ భాగమని, మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం, రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వడ్డీ రహిత రుణాలు, ఉపాధి అవకాశాలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి మహిళ స్వావలంబిగా ఎదగడానికి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో వేదవతి, మండల అధికారులు, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# కోహెడలో విషాదం

- **గుడిసెలకు షార్ట్ సర్క్యూట్**
- **వంటసామగ్రి, డబ్బులు దగ్ధం**



**కోహెడ, మన చౌరాస్తా:** కోహెడ మండల కేంద్రంలోని పోచమ్మవాడలో దారుణ ఘటన చోటుచేసుకుంది. శ్రావణపల్లి వేంకటేశం కుటుంబం నివసిస్తున్న గుడిసెలో సోమవారం అర్ధరాత్రి షార్ట్సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి వంటసామగ్రి, అవసరమైన గృహోపయోగ వస్తువులతో పాటు కుటుంబ అవసరాల కోసం పోగుచేసుకున్న డబ్బులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇటీవల ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల మంజూరులో భాగంగా వేంకటేశం కుటుంబానికి ఇల్లు మంజూరైంది. ఇండ్ల నిర్మాణం కొనసాగుతుండగా, కుటుంబం సమీపంలో తాత్కాలికంగా గుడిసెలో నివసిస్తోంది. అయితే, దురదృష్టకరంగా ఈ నెల 19న కుటుంబ పెద్ద వేంకటేశం అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబం తీవ్ర విషాదంలో ఉంది. వదిలిన దుఃఖం మరువకముందే గుడిసెలో షార్ట్ సర్క్యూట్తో జరిగిన అగ్ని ప్రమాదం ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీసింది. వేంకటేశం భార్య విజయ, కుమారులు సందీప్, సాయి అనేక ఇబ్బందులతో అప్పోసప్పో చేసి తెచ్చుకున్న డబ్బులు, అవసరమైన వస్తువులు కాలిపోవడంతో కుటుంబ పరిస్థితి మరింత క్లేశంలోకి వెళ్లింది. సంఘటనను చూసిన స్థానికులు కూడా కంటతడి పెట్టుకున్నారు. అగ్ని ప్రమాదం అనంతరం రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి నష్టపరిహారం, అత్యవసర ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

## కొమురవెల్లి దేవస్థానం ఉత్సవ కమిటీ నియామకం

### చైర్మన్‌గా నరసింహారెడ్డి



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానానికి కొత్త ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ కమిటీ పదవీకాలం 10.12.2025 నుంచి 21.03.2026 వరకు ఉంటుందని అందులో పేర్కొంది. దేవస్థానంలో డిసెంబర్ 14న జరిగే కళ్యాణ మహోత్సవం, అనంతరం జరిగే జాతర బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఈ కమిటీ పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టనుంది. ఉత్సవ కమిటీ చైర్మన్గా చైర్మన్‌గా గంగం నర్సింహా రెడ్డి, సభ్యులుగా చికిరి కోమరయ్య, మెరుగు నరేష్ గౌడ్, పల్లె మహేష్, వంగరి వరలక్ష్మి, నంగునూరి సత్యనారాయణ, కటం శ్రీనివాస్, సర్ల లింగం, పయ్యావుల ప్రవీణ్ కుమార్ యాదవ్, అలుగల మల్లేశం, బొచ్చు ఎల్లయ్య, గొరిగె రవి నియమించారు.



## రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

హుస్నాబాద్, మన చౌరాస్తా: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామ స్థాయిలో ఘనంగా నిర్వహించుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు ఇక్కడ మాట్లాడుతూ భారత రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని భారత రాజ్యాంగంపై నిర్మితమవుతున్న ప్రజా వ్యవస్థల గూర్చి సంక్లుప్తంగా ప్రజలకు, యువతరానికి వివరించి చెప్పాల్సిన బాధ్యత అంబేద్కర్ వాదులపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





## కోహెడ డంప్ యార్డు తరలించండి


**హుస్నాబాద్, మన చౌరాస్తా :** డంప్ యార్డు తరలింపు తో తీరనున్న స్థానిక ప్రజల సమస్యలు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండల కేంద్రంలోని బాడుగుల చెరువు పక్కన ఉన్న డంపింగ్ యార్డు వల్ల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్న అంశాలను స్థానిక ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్ గారి దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడారు. వెంటనే జిల్లా కలెక్టర్ డంప్ యార్డు మార్చుటకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఇట్టి ఆదేశాల ప్రకారం కోహెడ మండలంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 998 లో 2 ఎకరాల భూమిని డంప్ యార్డు కొరకు కేటాయిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డంప్ యార్డు తరలించడం వల్ల స్థానిక ప్రజల సమస్యలు & అక్కడే చెరువులో చేపల వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న మత్యకారుల కుటుంబాల సమస్యలు తీరనున్నట్లు వెల్లడించారు.

## సీఎం సహాయ నిధి పేదల పాలిట వరం

**బోథ్, మన చౌరాస్తా :** సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు మంగళవారం ఆడే గజేందర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ మండల కేంద్రానికి చెందిన వేముల సంధ్య రాణి రూ. 60 వేలు, గుడిహత్నూర్ మండలంలోని డొంగర్గవ్ గ్రామానికి చెందిన దశరథ్ 60 వేలు, నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన పుష్పాల రూ.40 వేలు, వాగ్దారికి చెందిన చౌహాన్ బిక్కుకు రూ.20 వేలు, వాంకిడికి చెందిన ఫిర్దోష్ బేగంకు రూ. 40 వేలు, ఇచ్చోడ మండలంలోని మల్యాలకు చెందిన భూతి రుచితకు రూ. 10,500 చెక్కులను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు కుమారి, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, శ్రీరామోజీ నారాయణ మురళిగౌడ్, మాధవ్ ససాని మారుతి కుర్మే మహేందర్, భోజన్న, నాగేందర్, గజ్జల అశోక్, షేక్ అలీ,ఎండి సద్దాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** టూరిజం కార్పొరేషన్లో కాంట్రాక్టు మరియు అవుట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ ఉద్యోగుల ప్రతినిధులు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తో కలిసి సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. గత 23 సంవత్సరాలుగా టూరిజం కార్పొరేషన్కు సేవలు అందిస్తున్న ఉద్యోగులు శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తగిన వేతనం, భద్రత, పదవీవిరమణ ప్రయోజనాలు అందకపోవడం బాధాకరమని ప్రతినిధులు తెలిపారు. గతంలో యాజమాన్యం సమాన పనికి సమాన వేతనం అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ అది అమలు కాలేదని వారు గుర్తుచేశారు. దీంతో చాలా మంది ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా వారు విన్నవించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లే వీరి పదవీవిరమణ వయస్సును కూడా 61 సంవత్సరాలకు పెంచాలని వారు కోరారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా సమాన వేతనం, సేవా భద్రత, పదవీవిరమణ సదుపాయాలను కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సబ్బు రాజమౌళి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- **మూడు విడుతల్లో సర్పంచ్ ఎన్నికలు**
- **డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఎన్నికల షెడ్యూల్ను విడుదల చేశారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు.